క్లుప్తంగా

హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడిగా బాదుల్లా

కడప రూరల్: నేషనల్ యాంటీ క్రైమ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడిగా కడపకు చెందిన సుంకేసుల బాదుల్లా నియమితులయ్యారు. తన నియామకంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయం, మానవ హక్కుల, నేర రహిత సమాజం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. తన సేవలను గుర్తించి తనకు రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు గోపినాథ్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలను అరికట్టాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఆన్‌లైన్ మోసాలను అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు దస్తగిరి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం స్పందనలో డీఆర్‌ఓ గంగాధర్ గౌడ్‌కు ఏఐవైఎఫ్ నాయకులు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డేటింగ్ యాప్, లోన్ యాప్, బెట్టింగ్ యాప్‌లతో పాటు నేరాన్ని ప్రేరేపించే యూ ట్యూబ్ చానల్స్‌ను నిషేధించాలన్నారు. బెట్టింగ్ యాప్, డేటింగ్ యాప్ ద్వారా యువత మోసపోతోందని.. ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్ మోసాలను అరికట్టాలని కోరారు. ఏఐవైఎఫ్ నాయకులు సురేష్, శివ నాగేంద్ర పాల్గొన్నారు.

డీఆర్వోకు వినతి

కడప సిటీ : ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కార నిమిత్తం ఏపీ జేఏసీ అమరావతి వైఎస్సార్‌జిల్లా చైర్మన్ జీవన్ చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కృష్ణకుమార్ సోమవారం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రమిచ్చారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు, సెక్రటరీ జనరల్ దామోదర్‌రావు ఆదేశాల మేరకు అన్ని జిల్లాల కలెక్టరేట్‌లో ఉద్యోగుల డిమాండ్ల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించడంలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ సెక్రటరీ రాజశేఖర్, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు రొనాల్డ్ ఉదయ్ భాస్కర్ పాల్గొన్నారు.

‘ఉమ్రా’ పుణ్యకార్యం

కడప కార్పొరేషన్: ప్రతి ముస్లిం జీవితంలో ఒక్కసారైనా ఉమ్రా యాత్ర చేయాలని.. ఇది పుణ్యమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ అన్నారు. ఇటీవల ఉమ్రా యాత్ర ముగించుకొని వచ్చిన జేకే యూత్ అధ్యక్షుడు పి.ఖాదర్‌బాషా మక్కా నుంచి తెచ్చిన ప్రసాదాలను ఆయన స్వీకరించారు. రషీద్‌ఖాన్, మైనార్టీ నాయకులు ఆర్. కరిముల్లా, ఎస్ఎండీ సలీం బాషా పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

చెన్నూరు : చెన్నూరు మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ సభా భవనంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశంలో రెవెన్యూ, విద్య, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్, సచివాలయాలు, రైతు భరోసా, వైఎస్సార్ హెల్త్ క్లినిక్, గృహ నిర్మాణం తదితర శాఖలపై సమీక్ష ఉంటుందన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం: కమలాపురం నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం జరగనున్న మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నారని నగర కమిషనర్ రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆయన అందులో పేర్కొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

చెన్నూరు: పంచాయతీ అభివృద్ధికి సహకారాన్ని అందించాలని సర్పంచ్ సిద్దిగారి వెంకట సుబ్బయ్య, కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో పలు తీర్మానాలు చేసి ఆమోదించారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

చింతకొమ్మదిన్నె: వడ దెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని హోమియోపతి వైద్యుడు షాకీర్ హుస్సేన్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని జెడ్పీ హైస్కూల్‌లో హోమియోపతి దినోత్సవం సందర్భంగా హోమియోపతి వైద్య విధానం పితామహుడు క్రిష్టియన్ ఫ్రెడరిక్ శామ్యూల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు వడదెబ్బ నివారణ మందులను వేశారు. ప్రధానోపాధ్యాయురాలు శైలజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేని చదువు అవసరం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలో ఐదో తరగతి వరకు ఒత్తిడి లేని అభ్యసన ప్రక్రియ నిర్వహించాలని నేషనల్ కరికులం ఫ్రేం వర్కు కమిటీ చెబుతోందని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సివి ప్రసాద్‌లు తెలిపారు. రాత పరీక్షల ద్వారా మూల్యాంకనం 3వ తరగతి వరకు రద్దు చేయాలని అన్నారు. పాఠ్యపుస్తకాల అంశాల విశ్లేషణ ద్వారా ప్రతిభను అంచనా వేయాలని కోరారు. 5వ తరగతి వరకు పాఠ్యాంశాలుపై విశ్లేషణ సంబంధిత నమూనాల ప్రదర్శన ద్వారా మూల్యాంకనం ఉండాలని కోరారు.ప్రాథమిక పాఠశాలలన్నీ 1 నుంచి 5 వరకు ఉండాలని ఉన్నత పాఠశాలల విలీనం ఆపాలని కోరారు. హైస్కూల్ స్థాయి తరగతుల నుంచి రాత పరీక్ష మూల్యాంకనం ప్రవేశ పెట్టాలని కోరారు.

నగరంలో పందుల పెంపకానికి బ్రేక్

- హైకోర్టు ఆదేశాలతో మార్గదర్శకాలు రూపొందించిన ప్రభుత్వం
- ప్రతి పందికీ లైసెన్స్ తప్పనిసరి

కడప కార్పొరేషన్: నగరాల్లో, పట్టణాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ ప్రజలను అనారోగ్యం పాలు చేస్తున్న పందుల సంచారానికి బ్రేక్ పడనుంది. రాష్ట్ర ప్రధాన న్యాయస్థానం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం గత నెల 21వ తేది మార్గదర్శకాలు జారీ చేసింది. పట్టణాల్లో పందులను ఇష్టానుసారంగా పట్టుకొని చంపేస్తున్నారని నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ వారు హైకోర్టును ఆశ్రయించగా ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులననుసరించి పందుల పెంపకం దారులు ప్రతి పందికీ లైసెన్స్ పొందాల్సి ఉంటుంది. లైసెన్స్ బిళ్ల ఉన్న పందులను మాత్రమే వారు పెంచాల్సి ఉంటుంది. నగరాలు, పట్టణాల సరిహద్దుల నుంచి 3 నుంచి 5 కి.మీల దూరంలో



వీధుల్లో సంచరిస్తున్న పందులు, వాటి పిల్లలు(ఫైల్)

ప్రభుత్వం చూపిన స్థలాన్ని కొనుగోలు చేయడం ద్వారాగానీ, లీజుకు తీసుకొనిగానీ పందులను పెంచుకోవచ్చు. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకునే హక్కును మున్సిపాలిటీలకు కల్పించారు.

పందుల గుర్తింపునకు సర్వే

కడప నగరంలో ప్రధానంగా ఇందిరానగర్, భగత్ సింగ్ నగర్, సరోజినీనగర్, రామాంజనేయపురం, వికలాంగుల కాలనీ, ఫరీదా నగర్, నిరంజన్ నగర్, దేవునికడప, గంజికుంట కాలనీ,శాటిలైట్ టౌన్‌షిప్, దండు, నాగరాజుపేట, ఎస్వీ డిగ్రీ కాలేజ్ కింది ప్రాంతాల్లో పందుల పెంపకం దారులు ఉన్నారు. నగరపాలక అధికారులు ప్రస్తుతం వారికి నోటీసులిస్తూ వారి వద్ద ఎన్ని పందులు ఉన్నాయో సర్వే చేస్తున్నారు. రెండు, మూడు రోజుల్లో ఈ సర్వే పూర్తయ్యే అవకాశం ఉంది.

కొలుములపల్లె డంపింగ్ యార్డు వద్ద స్థలం కేటాయింపు

కడప పరిధిలోని పందులను పెంచుకోవడానికి రాయచోటి రోడ్డులో ఉన్న కొలుముల పల్లె డంపింగ్ యార్డు వెనుక పందుల పెంపకం దారులకు స్థలం కేటాయించాలని నగరపాలక సంస్థ అధికారులు ప్రతిపాదించారు. ఈ మేరకు చింతకొమ్మదిన్నె తహసీల్దార్‌కు లేఖ రాశారు. పందుల పెంపకందారులు ముందుకు వస్తే ఆ స్థలాన్ని ప్రభుత్వ నిబంధనల ప్రకారం లీజుకు ఇవ్వనున్నారు.

పందులున్న ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం

పందులు సంచరిస్తున్న ప్రాంతాల్లో తీవ్ర అపరిశుభ్ర వాతావరణం ఉంటుంది. కాలువల్లో, నీటి గుంతల్లో ఇవి పొర్లాడి ప్రజలు నివసిస్తున్న వీధుల్లో ఇష్టానుసారంగా తిరగడం వల్ల వాటిపై వాలిన ఈగలు, దోమలు మనుషులపై వాలడం, తినే ఆహార పదార్థాలపై కూర్చోవడం వల్ల వ్యాధులు వ్యాపిస్తున్నాయి. ముఖ్యంగా పందులను కుట్టిన దోమలు మనుషులను కుడితే మెదడువాపు వ్యాధి వస్తుంది.

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం

పందుల పెంపకంపై రాష్ట్ర హైకోర్టు, ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం. ఇప్పటికే పందుల పెంపకం దారులను నోటీసులు ఇచ్చాం. వారు సహకరించాలి. నగర శివార్లలో వారికి స్థలం కేటాయిస్తున్నాం, అక్కడ పందులను పెంచుకుంటే ఎవరికీ ఏ ఇబ్బందులు ఉండవ్. గిరిజన ప్రజా సంఘాలు కూడా వారికి అవగాహన కల్పించాలి.

– ప్రశాంత్ వర్ధన్, ఎంహెచ్‌ఓ, నగరపాలక సంస్థ

మంచి నీటి సమస్యను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగరలలో నెలకొన్న మంచి నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ కోరారు. సోమవారం నగరంలోని ఉక్కాయపల్లెలో డీవైఎఫ్‌ఐ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కాయపల్లె ఏర్పడి దాదాపు 30 ఏళ్లు పూర్తయినా నేటికి మురుగు కాల్వలు ఏర్పాటు చేయడంలో కార్పొరేషన్ యంత్రాంగం పూర్తిగా విఫలం చెందిందన్నారు. ఈ ప్రాంతంలో పందులు స్వైర విహారం చేస్తుండటంతో వృద్ధులు, చిన్న పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. డంపింగ్ యార్డులో పార్కుల పనులు పూర్తయిన నేటికి ప్రారంభానికి నోచుకోలేదన్నారు. డీవైఎఫ్‌ఐ నాయకులు ఓబులేసు, వినోద్ కుమార్, రషీద్ పాల్గొన్నారు.



ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

‘మా నమ్మకం నువ్వే జగనన్నా’

కడప కార్పొరేషన్: ‘మా నమ్మకం నువ్వే జగనన్నా...’ అంటూ జనం నినదిస్తున్నారు. ‘మా భవిష్యత్ నువ్వే జగన్’ కార్యక్రమం భాగంగా 20వ డివిజన్‌లోని ఏపీహెచ్‌బీ కాలనీ, మారుతీనగర్‌లో కార్పొరేటర్ వై. మాధవి, డివిజన్ ఇన్‌చార్జి శ్రీరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ ప్రభుత్వంలో ఎన్నికల హామీలు ఇచ్చి మోసం చేసిన వైనాన్ని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్నికల హామీలు తు. చ తప్పకుండా అమలు చేస్తున్న విధానాన్ని వివరించారు. ప్రజల మద్దతు కోరుతూ వారి ఇళ్లకు స్టిక్కర్లు అతికించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

30వ డివిజన్‌లో... 30వ డివిజన్ నాగరాజుపేటలో కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ ఆధ్వర్యంలో ‘మా భవిష్యత్ నువ్వే జగన్’ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.



30వ డివిజన్లో సర్వే నిర్వహిస్తున్న కార్పొరేటర్ షఫీ తదితరులు

కోత లేకుండా కార్డియాక్ సర్జరీ

కడప రూరల్ : గుండె శస్త్ర చికిత్సకు సంబంధించి ఎంబీసీఎస్‌లో వచ్చిన విప్లవాత్మక మార్పుల కారణంగా కనీస కోత లేకుండా కార్డియాక్ సర్జరీ నిర్వహిస్తున్నట్లు చెన్నై అపోలో ఆస్పత్రి వైద్యులు ధీరజ్‌రెడ్డి తెలిపారు. స్థానిక అరుణాచల ఆస్పత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గుండె శస్త్ర చికిత్సలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. గుండె శస్త్ర చికిత్స అంటే ఛాతి మధ్యభాగంలో కోత వేయడం వల్ల భారీ మచ్చ ఏర్పడుతుందన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కనీస కోత లేకుండా కార్డియాక్ సర్జరీని నిర్వహిస్తామన్నారు. ఈ విధానం వల్ల కణజాల గాయం తగ్గడంతోపాటు గాయం సంక్రమణ చెందకుండా ప్రమాదాన్ని తగ్గిస్తుందన్నారు. బాధితులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్పత్రి సీనియర్ జనరల్ మేనేజర్ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ కడపలోని అరుణాచల ఆస్పత్రి భాగస్వామ్యంతో చెన్నై అపోలో ఆస్పత్రి వారు ఈ శస్త్ర చికిత్స నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వాసులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ధీరజ్‌రెడ్డి

ప్రజల దాహార్తి తీర్చడమే ట్రస్టు లక్ష్యం

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలో ప్రజల దాహార్తి తీర్చడమే తమ ట్రస్టు లక్ష్యమని లేవాకు నారపురెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్, వైస్ చైర్మన్ లేవాకు లక్ష్మిరెడ్డి, లేవాకు నితీష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని కోటిరెడ్డిసర్కిల్ సమీపంలో చలివేంద్రాలతోపాటు మంచినీటి ట్యాంకర్లను వారు ప్రారంభించి మాట్లాడారు. 2006 సంవత్సరంలో ఒక చలివేంద్రంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం నేడు కడప నగరంలో 21 చలివేంద్రాలకు చేరుకున్నాయన్నారు. వీటి ద్వారా ప్రతి రోజు ప్రజల దాహార్తిని తీరుస్తున్నామన్నారు. ఇలా ఈ కార్యక్రమం వంద రోజులపాటు నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్లు అనిల్‌రెడ్డి, మహేశ్వరెడ్డి, శివ, శ్రీను, వేమయ్య, రాజశేఖర్‌రెడ్డి, ఓబులేసు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ట్రస్టు వైస్ చైర్మన్ లేవాకు నితీష్‌రెడ్డి

గంగమ్మ సన్నిధిలో షష్టిపూర్తి

కడప కల్చరల్ : కడప నగరం హనుమప్పవీధిలోని నడివీధి గంగమ్మ సన్నిధిలో సోమవారం తొమ్మిది జంటలకు ఉల్లాస భరితంగా షష్టి పూర్తి నిర్వహించారు. ఆ క్షేత్ర మూడవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నుంచి శుక్రవారం వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం స్థానిక భక్తులు అమ్మవారికి బోనాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయ సన్నిధిలో సమర్పించారు. అనంతరం 60 సంవత్సరాలు దాటిన తొమ్మిది జంటలకు వారి కుటుంబ సభ్యుల మధ్య కల్యాణ క్రతువుతో షష్టిపూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో మాలల మార్పిడి ఉల్లాస భరితంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం పవిత్ర జల కలశాల ఊరేగింపు, చండీహోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం రాహుకాల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం గోమాతకు సీమంతం నిర్వహిస్తారు.

కనులపండువగా ఆది దంపతుల కల్యాణం





కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు (ఇన్‌సెట్) కల్యాణమూర్తులుగా స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : కడప నగరం మోచంపేటలోని శ్రీ ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. తొలుత ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు నిర్వహించి వధూవరులుగా ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కల్యాణమూర్తులను కొలువుదీర్చారు. అనంతరం అర్చకులు రవిశంకర్ ఆధ్వర్యంలో వేద పండితుల బృందం ఆది దంపతుల కల్యాణాన్ని క్రమంగా నిర్వహించారు. భక్తుల పంచాక్షరి నామ జపం వద్ద కల్యాణోత్సవం కోలాహలంగా సాగింది. దేవదాయశాఖ కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ ఎ.శ్రీధర్ పర్యవేక్షణలో కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్లను ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పెన్షనర్ల సంక్షేమానికి చేయూతనివ్వండి

- ఈసీ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

కడప ఎడ్యుకేషన్: ఉద్యోగ విరమణ పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం చేయూతనివ్వాలని పెన్షనర్ల ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, కార్యదర్శి రామ్మూర్తినాయుడు కోరారు. సోమవారం కడపలోని పెన్షనర్ల కార్యాలయంలో నూతన కార్యవర్గ సభ్యులతో ఈసీ సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెన్షనర్ల పెండింగ్ బకాయిలు ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. పెన్షనర్ల వయో భారాన్ని గుర్తించి వారికి న్యాయం చేయాలని వారు కోరారు. వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలను మానవతాదృక్పథంతో చూడాలని, క్యాష్‌లెస్ ప్రాతిపదికన హాస్పిటల్స్‌లో వసతి కల్పించాలని కోరారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ రాధాకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి బాలయల్లారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వెంకటసుబ్బారెడ్డి, కార్యవర్గ సభ్యులు బాలసుబ్రమణ్యం, అపూర్వ సుందరి, పార్వతమ్మ, రామమూర్తి కోశాధికారి నాగేష్ పాల్గొన్నారు.

పాలనలో మార్పు తెచ్చిన వ్యక్తి సీఎం జగన్

– ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: పరిపాలన ఎప్పుడూ ఒకే విధంగా ఉండకూడదని, ప్రాంతాలను బట్టి, సమస్యలను బట్టి, కాలానుగుణంగా పాలనలో మార్పు రావాలని బావించి వ్యవస్థలనే మార్చేసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన ‘మా నమ్మకం నువ్వే జగన్’ డోర్ స్టికర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగనన్న వలంటీర్, సచివాలయ, ఆర్‌బీకే వ్యవస్థలను తీసుకువచ్చి ప్రజల చెంతకే పాలన తెచ్చారన్నారు. వ్యవస్థలను పూర్తిగా మార్చి ప్రజలకు మంచి సేవలు అందిస్తున్నారని గుర్తు చేశారు. ఈ వ్యవస్థలు దేశానికే ఆదర్శం అయ్యాయని, తద్వారా నంబర్ వన్ సీఎం జగన్ మోహన్ రెడ్డి అని కీర్తింపబడు తున్నాడన్నారు. నాడు–నేడు ద్వారా విద్య, వైద్యంలో విప్లవం తీసుకువచ్చారన్నారు. గతంలో బాబు పాలన 14 ఏళ్ల చూశామని, పాలనంతా అవినీతి, రాక్షస, దుర్మార్గ పాలన అన్నారు. ఈ నాలుగేళ్ల జగనన్న పాలనకు, గత పాలనకు ఎంతో తేడా ఉందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, మోహన్ రెడ్డి, ఎస్‌సీ పుల్లారెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, జగన్‌మోహన్ రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, కొండారెడ్డి, దేవదానం పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు..

వీరపునాయునిపల్లె: ప్రజల సమస్యలను తెలుసుకోవడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తోందని ఎమ్మెల్యే పి రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనిమెల గ్రామంలో మండల కన్వీనర్ రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామంలోని ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని వారిని అడిగి తెలుసుకొన్నారు. ఎస్సీ కాలనీలో సిమెంటు రహదారి ఏర్పాటు చేయాలని కాలనీవాసులు ఆయన్ను కోరారు. వెంటనే సిమెంటు రహదారి నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నామన్నారు. పక్కా గృహం నిర్మించుకొనేందుకు ఇసుక కావాలని వికలాంగుడు జయరాజ్ .. ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఇంటిని నిర్మించుకొనేందుకు ఎంత ఇసుక అవసరమైతే అంత ఉచితంగా అందించాలని సర్పంచ్ నరేష్‌రెడ్డికి సూచించారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ నరేష్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, సంగమేశ్వర దేవస్థానం చైర్మన్ శివాంజనేయరెడ్డి, సర్పంచు నరేష్‌రెడ్డి, ఎంపీటీసీ రాఘవ యాదవ్, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ ఉదయ భారతి తదితరులు పాల్గొన్నారు.



మా నమ్మకం నువ్వే జగన్ డోర్ స్టిక్కర్లు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

నగరపాలక సంస్థ అవినీతిపై విచారణ జరిపించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కడప నగర పాలక సంస్థలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరిపించాలని సీపీఎం నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. నగర పాలక సంస్థలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతోందని ఆరోపించారు. టౌన్ ప్లానింగ్ అధికారి అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోతోందని విమర్శించారు. నగర పాలక సంస్థకు ఐఏఎస్ అధికారి కమిషనర్‌గా వచ్చినా అవినీతి అరికట్టే ప్రయత్నం చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

‘టెన్త్’ కేంద్రాల పరిశీలన

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగరంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం కొన్ని కేంద్రాలను కడప ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి పరిశీలించారు. నగరంలోని మున్సిపల్ బాలుర హైస్కూలుతోపాటు బాలికల హైస్కూలు, నారాయణ హైస్కూలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంతోపాటు ఎండల నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఉండేలా చూడాలని ఆదేశించారు.

అర్హులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్: డీఎస్సీ–98లో అర్హులైన అభ్యర్థులందరికీ త్వరగా ఉద్యోగాలు ఇవ్వాలని సోమవారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో 580 మంది డీఎస్సీ–98 అర్హులుగా గుర్తించి ముఖ్యమంత్రి కార్యాలయానికి విద్యాశాఖ అధికారులు జాబితాను పంపారన్నారు. కానీ జిల్లాలో 172 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇస్తున్నారని మిగతా వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. డీఎస్సీ–98 అభ్యర్థులు చంద్రమౌళి, మురళీమోహన్‌రెడ్డి, ఎరుకలయ్య, శివాజీ, సుధాకర్, నారాయణరెడ్డి, సాంబశివారెడ్డి, రమణారెడ్డి, జనార్ధన్, గురప్ప, చంద్రశేఖర్, వెంకటరమణ, రమేష్, పుల్లయ్య, వాసు, రామోహన్, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హాకీ టోర్నమెంట్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో సోమవారం నిర్వహించిన సీనియర్ హాకీ క్రీడాకారుడు దీపక్ దేవ్ ఆనంద్‌కుమార్ మెమోరియల్ హాకీ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎస్.వి.పి.అమృత్‌రాజ్ టోర్నీని ప్రారంభించి మాట్లాడారు. జిల్లా హాకీ జట్టులో దీపక్ చక్కటి ఆటతీరును కనబరిచి జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించేవారన్నారు. సీనియర్ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని క్రీడాకారులు రాణించాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. హాకీ సీనియర్ శిక్షకుడు ఆకుల రమేష్‌బాబు, పి. కల్యాణ్‌కుమార్, దీపక్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

పేదలకు చేసే సేవలు పుణ్యఫలాలనిస్తాయి



పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు సుభాన్‌బాషా

కడప కార్పొరేషన్: పవిత్ర రంజాన్ మాసంలో పేదలకు చేసే సేవలు పుణ్య ఫలాలను అందిస్తాయని వైఎస్సార్‌సీపీ నాయకులు, వికాస్ విద్యాసంస్థల అధినేత సుభాన్ బాషా, 23వ డివిజన్ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఐస్‌క్రీం రవి అన్నారు. సోమవారం స్థానిక ఏడురోడ్ల కూడలిలోని సుభాన్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఐస్‌క్రీం రవి మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రతి ఏడాది సుభాన్ బాషా ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేయడం అభినందనీయమన్నారు. గుంతబజార్ మసీదు కమిటీ సభ్యులు ఉస్మాన్ ఖాన్, షఫీవుల్లాఖాన్, రఫీవుద్దీన్, సుల్తాన్ బాబా, రియాజుద్దీన్, ఖదీర్, అలీ, ముబారక్ పాల్గొన్నారు.

బీజేవైఎం ధర్నా

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే రద్దుచేయాలని, ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరుతూ బీజేవైఎం కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర విభజన జరిగినప్పటినుంచి ఇప్పటివరకు ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లే విధంగా ప్రభుత్వ జాబ్ క్యాలెండర్ ఉందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు వీరప్రతాప్‌రెడ్డి, విజయప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమాస్తుల రక్షణ కోసమే బీజేపీలోకి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి తన అక్రమాస్తులు కాపాడుకోవడానికే బీజేపీలో చేరారని డీసీసీ అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఆయన మాట్లాడుతూ చివరి బంతి ఆటగాడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి తన ఆస్తులను కాపాడుకోవడానికి బిజెపిలో చేరి నేడు కాంగ్రెస్ పార్టీ పెద్దల మీద వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీని ఇష్టానుసారంగా విమర్శిస్తే ఆంధ్రలో తిరగలేని పరిస్థితులు వస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల్లేష్, ప్రసాద్ గౌడ్ పాల్గొన్నారు.

మోడల్ ఎంసెట్‌ను జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: రెవల్యూషనరీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న మోడల్ ఎంసెట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆర్‌ఎస్‌యూ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ పూర్తి చేసుకుని ప్రతి విద్యార్థి ఈ ఎంసెట్ ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ఎగ్జామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు.రాష్ట్ర కార్యదర్శి కిషోర్, ఉపాధ్యక్షులు ప్రశాంత్, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.